# అను'బంధం'

**అది డిసెంబరు నెల. మంచు దట్టంగా కురవడం వల్ల నేలంతా పొగమంచు రొజాయిలా కప్పుకున్నట్టుంది. అప్పుడే నిద్ర లేచిన నాకు కిటికీలోంచి బయట మనోహరమైన దృశ్యం. ఇలాంటి దృశ్యాల్ని ఎన్నో ఏళ్లుగా చూడడానికి నా కళ్లు అలవాటు పడ్డాయి.**

ఇంతలో వీధి చివర్లో ఏదో కలకలం. గబగబా గేటు తీసుకుని బయటకు వచ్చి అక్కడ ఏమవుతోందో అని ఆతృతగా గుంపులోనికి చొరబడ్డాను.

అక్కడ ఆ దృశ్యాన్ని చూసిన నా హృదయం ద్రవించిపోయింది.

* * *


నాకు పెళ్లయి నాలుగేళ్లు అయింది. చక్కని భర్త, మంచి ఉద్యోగం, అత్తమామల అదుపాజ్ఞలంతంత మాత్రం. అయితే మాకు 'మనవణ్ణి ఎప్పుడిస్తావు' అని వారడిగినప్పుడల్లా నేనాందోళనకు గురవుతున్నాను. మేమేదో కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి సంతానాన్ని దూరం చేసుకుంటున్నామేమో అని మా అత్తగారు నణుక్కోవడం అప్పుడప్పుడు నా చెవిన పడ్తోంది. అయితే అలాంటిదేం లేదని ఆవిడకు చెప్పడం కన్నా, ఆవిడ ఒళ్లో ఓ బుజ్జాయిని పడేస్తే అదే ఆవిడకు పెద్ద సమాధానం. కాని కలసిరాని కాలం. ఎన్నో పూజలు, వ్రతాలు చేశాం. అయితే డాక్టర్లు మాత్రం ఏదో లోపం ఉంది కొన్నాళ్లు మందులు వాడాలన్నారు. ఇప్పటికే చుట్టూ ఉన్న చాలామంది నిర్ణయాలు అనుభవంలోకి వస్తున్నాయి. అనేక తరుణోపాయాలను వెదుక్కొంటున్నారు. అయితే ఆశ చావక ఇంకా అలా నిరీక్షించాల్సి వస్తుంది. మా అత్తగారు మాత్రం 'ఏ వయసులో ఆ ముచ్చట' అంటూ దీర్ఘాలు తీస్తున్నారు.

జనాభా పెరిగిపోతోంది అని చదివినప్పుడల్లా నాకు అసూయ. ఇలా కొన్నాళ్ల తర్జనభర్జనలనంతరం మేం ఓ నిర్ణయానికొచ్చేము. తెలిసిన బంధువుల దగ్గర్నుండి గాని లేదా ఏదైనా పేరున్న అనాథాశ్రమం నుండి గాని ఓ పాపనో ఓ బాబునో దత్తత తెచ్చుకుందామని. ఈ విషయాన్ని ప్రస్తావించగానే మా అత్తగారు "రక్తం పంచుకు పుట్టిన వాళ్లయితే.." అని అంటూనే అయిష్టంగానే ఒప్పుకున్నారు.

* * *

గుంపును ఛేదించుకుంటూ దగ్గరికి వెళ్లేసరికి...ఆ చలిలో...చెత్తకుప్పలో...రక్తమోడుతూ...వణుకుతున్న పసిగుడ్డుని చూడగానే నా గుండె కలుక్కుమంది ఏ తల్లికి ఇంతటి దుష్కార్యాన్ని చేయడానికి మనసొప్పిందో అని. వెంటనే ఆలస్యం చేయక ఆ బాబుని ఎత్తుకుని, చీరకొంగుతో చుట్టి అక్కడున్న నలుగురిని ఒప్పించి మా ఇంటికి తీసుకొచ్చి మా అత్తగారికి చూపించి విషయం చెప్పి మిగతా పనులకు సిద్ధపడ్డాను. పాలు, వేన్నీళ్లు వగైరా సిద్ధం చేసుకున్నాను. మా ఆయన సాయంత్రానికల్లా మిగతా ఫార్మాలిటీస్ అవీ పూర్తి చేసుకొచ్చారు.

ఇక ఆ రోజు నుండి బాబుతోనే లోకం. తొమ్మిది నెలలు మోయక్కర్లేకుండా, పురిటి నొప్పులు పడక్కర్లేకుండా, పండంటి బిడ్డడికి తల్లినయ్యానన్న ఆనందంలో నేను నిజంగానే తల్లినవుతున్నానని మరో శుభవార్త. అదృష్టం కలిసొస్తే... అన్నట్లు ఏడాది తిరక్కుండానే ఇద్దరు పిల్లలకు తల్లినయ్యాను. నాకు ఇక సమయం



చాలడం లేదు. అటు అత్తమామలు, మా వారు, ఇటు పిల్లలతో రోజుకు మరో ఇరవై నాలుగ్గంటలుంటే బావుణ్ననిపిస్తోంది. అయితే...సరిగ్గా అక్కడ నుండే నాలో ఉన్న స్వార్థం బయటపడ్తోందన్న సంగతి నాకు తెలియడానికి కొంచెం సమయం పట్టింది. కన్నకొడుకు తండ్రిని పోలి కొంచెం తెల్లగా, బొద్దుగా ఉంటాడు. పెద్దవాడు కొంచెం చామనచాయతో బక్కగా ఉంటాడు. అందుకని వాడిపై కొంచెం నిర్లక్ష్యం. అయితే ఆలోచనల్లో, ఆదర్శాల్లో బలంగా ఉండాలి గానీ బాహ్య సౌందర్యంలో కాదని నాకు తర్వాత తెలిసింది. 'వాడికి' స్తన్యం ఇవ్వడానికి కూడా నా మనసు తటపటాయిస్తోంది. ఒకప్పుడేమో ఏదో ఒక బిడ్డ ఉంటే చాలని అనుకున్నాను. అనుకోకుండా భగవంతుడు ఇచ్చిన 'వరాన్ని' ఇప్పుడేమో శంకిస్తున్నాను.

పిల్లలిద్దరూ పెరిగి పెద్దవారయ్యారు. పెద్ద చదువులు చదువుకున్నారు. నాలో ఆ 'స్వార్థం' మాత్రం బయటకి పొక్కకుండా అలా కంటిన్యూ అవుతోంది. ఇంతలో 'మా' చిన్నాడికి విదేశాల్లో ఉద్యోగం వచ్చింది. వాడు వెళ్లి డాలర్లు సంపాదించి నన్ను విమానాల్లో తిప్పుతానన్నాడు. నేను మాత్రం వాడ్ని ఇక్కడే ఉండి మా ఎదురుగానే ఏదో ఒక ఉద్యోగం చేసుకోమన్నాను. 'ఇలాంటి అవకాశం అందరికీ రాదు. ఒక్కసారి పంపిస్తే బోల్డు సంపాదించి తిరిగి వచ్చేస్తానని' పేచీ పెట్టాడు. చివరకు అయిష్టంగానే ఒప్పుకున్నాను. ఆ రోజు రానే వచ్చింది. నా బాధని కనీసం అర్థం చేసుకోకుండా విదేశాలకు ప్రయాణం అయిపోయేడు. పెద్దాడు నన్ను ఓదారుస్తూనే ఉన్నాడు. కానీ నాలో ఏదో తెలీని వెలితి. కళ్ల ముందు ఒక పిల్లాడు ఉన్నా, సొంత కొడుకు లేనందుకు బాధ. ఇక అక్కడ్నుండి ప్రతి వారం ఫోన్లోనే చిన్నవాడితో కబుర్లు. వాడు అక్కడ్నుండే ఇంటర్నెట్‌లోనే ఛాటింగ్‌లు. వెబ్ కెమేరాతో టీవీ స్క్రీన్ పైనే వాడిని చూసుకోవడం. కొన్నాళ్లకి, బహుశా బెంగవల్లనేమో నా ఆరోగ్యం క్షీణించింది. డాక్టర్ల దగ్గరకెళ్లాక అనేక టెస్టులు బెడ్‌రెస్టు కావాలన్నారు. మా అత్తమామలు పోయాక ఆయన పెద్దాఫీసరు అయ్యాక ఇంట్లో ఎవరూ చేసేవాళ్లు లేకపోతే బెడ్ రెస్టు ఎలా? మా పెద్దాడే అన్నీ తానై నా కోసం శ్రమపడుతున్నాడు. టైంకి మందులు అవీ ఇస్తూ జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. ఇంతలో మా చిన్నాడ్నుంచి ఫోన్ అనగానే ఆనందంతో అమాంతం లేవబోయి తన్నుకొని క్రిందపడిన నాకు మళ్లీ స్పృహ వచ్చేసరికి హాస్పిటల్‌లో ఉన్నాను. ఆపరేషన్ చేయాలట. అత్యవసరంగా బ్లడ్ కావాలట. బ్లడ్ దొరకగానే ఆపరేషన్ చేసేస్తారుట. చిన్నవాడికీ విషయం చెప్తే ఇప్పుడే వచ్చాను కదమ్మా! బోల్డన్ని ఇబ్బందులు. ఈసారికి ఎలాగో కానిచ్చెయ్యండి అని వాడి సమాధానం. మా పెద్దాడు మాత్రం చాలా కష్టపడి ఏర్పాట్లు చేస్తున్నాడు. నాకు మేచ్ అయ్యే బ్లడ్ కోసం ప్రయత్నిస్తున్నాడు. నాది 'ఓ నెగటివ్'. మా వారిది 'ఓ పాజిటివ్'. మా చిన్నాడిదే గ్రూపో మరి. ఎప్పుడు తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు. ఇలా నా ఆలోచనల్లో నేనుండగా మా పెద్దవాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "అమ్మా! నీది నాది ఒకటే బ్లడ్ గ్రూపమ్మా! అందుకని నేనే నీకు బ్లడ్ ఇస్తున్నానమ్మా!" అంతే నాకు కడుపులో కలుక్కుమన్నట్లయింది. పిల్లలు లేనప్పుడు ఏదో ఒక పిల్ల కావాలనుకున్నాను. తీరా నాకూ ఓ పిల్లాడు పుట్టేసరికి మానవత్వాన్ని మరిచిపోయి స్వార్థంతో 'నా' అనే దానికి పెద్దపీట వేశాను. నేనిన్నాళ్లూ ఎవర్నయితే వివక్ష వహిస్తూ వచ్చానో అలాంటి నా పెద్దకొడుకు నాకు రక్తదానం చేసి నన్ను బ్రతికించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అప్పుడనిపించింది 'బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ రిలేషన్స్' అని నా స్వార్థాన్ని కడగడానికా అన్నట్లు నా కళ్లు వర్షిస్తూనే ఉన్నాయి.

**-ఎ.వి.రాధాకృష్ణమూర్తి**
**(విశాఖపట్నం)**